## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. తిమ్మాపురం, కోనవానిపాలెం, గుర్రాజుపేట, గుడివాడ, పెదఉప్పలం, ఎల్‌పీఆర్‌పేట, కొత్త రేవుపోలవరం, రేవుపోలవరం, చినఉప్పలం, కె.వాతాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట, మంగవరం, సత్యవరం, మాసాహేబుపేట, పెదరాంభద్రపురం, సిహెచ్.నర్సాపురం, పాల్తేరు, అంకంపేట, ఈదటం, పాల్మన్‌పేట, కోర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### కె.వెంకటాపురంలో కుక్కలకు వ్యాక్సినేషన్



కె.వెంకటాపురంలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టరు హరిప్రియ

కోటవురట్ల: కె.వెంకటాపురం పశువైద్య కేంద్రంలో ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని సోమవారం కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. డాక్టరు హరిప్రియ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### 'స్థానికులకు ఉద్యోగావకాశాలు'



సీమంతంలో పాల్గొన్న మంత్రి అనిత

నక్కపల్లి: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు రానున్నాయని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం దేవవరం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో గడప గడపకు తెలుగు దేశం కార్యక్రమం నిర్వహించారు. పాయకరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిచారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

### నాలుగో రోజుకు సప్తాహం



సాయిబాబా ఆలయంలో భజనలు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహం కార్యక్రమం సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబా గీతాలాపన చేశారు. గురు పౌర్ణమి రోజున ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేటి వీరేంద్ర తెలిపారు.

### యూనిఫాం క్లాత్ పంపిణీ



యూనిఫాం క్లాత్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగరత్నం

కోటవురట్ల: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి మంచి మార్కులు తెచ్చుకోవాలని సర్పంచ్ దొడ్డి నాగరత్నం కోరారు. గొట్టివాడ ఎంపీపీ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం క్లాత్, టై, బెల్ట్, బ్యాగు, షూస్ అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మంచి ఫలితాలు తెచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జీవన్, ఉపాధ్యాయురాలు గంగా భవానీ, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ దుర్గ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శిథిల భవనం.. పశువైద్యం గగనం.!

- దీనావస్థలో యలమంచిలి ప్రాంతీయ పశువైద్యశాల
- పెచ్చులూడిన పైకప్పు.. పగుల్లిచ్చిన గోడలు
- కూలుతుందని హడలిపోతున్న వైద్యులు, సిబ్బంది
- అటకెక్కిన అత్యవసర మరమ్మతుల ప్రతిపాదనలు



నాచుపట్టి బీటలు వారిన యలమంచిలి ఏరియా ఆస్పత్రి భవనం

యలమంచిలి రూరల్:

ఎక్కడికక్కడ పెచ్చులూడిన పైకప్పు.. పగుల్లిచ్చిన గోడలు.. ఊడిపోయిన కిటికీలు.. వేలాడుతున్న విద్యుత్ వైర్లు.. పనిచేయని కుళాయిలు.. వర్షం వస్తే తడిచి ముద్దవుతున్న గదులు.. ఇదీ నాలుగు మండలాల ప్రజలకు సేవలందించే యలమంచిలి ప్రాంతీయ పశువైద్యశాల దుస్థితి. 64 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలుతుందో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి అత్యవసర మరమ్మతులు అవసరమని, శిథిల భవనం కండిషన్‌ను తెలియజేస్తూ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ గతేదాది డిసెంబరులో జిల్లా పశుసంవర్ధక అధికారికి లేఖ రాశారు. రూ.11.25 లక్షలతో రోడ్లు భవనాల శాఖ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలు పంపించారు.7 నెలలు గడుస్తున్నా ప్రతిపాదనలు మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆస్పత్రి భవనం శ్లాబ్ నుంచి నీరు కారడంతో లోపల గదులన్నీ తడిచిపోయాయి. గోడలన్నీ పగుల్లిచ్చి, వర్షపునీటితో నానిపోయాయి. దీంతో పైకప్పు గానీ, గోడలు గానీ కూలుతాయన్న భయాందోళనలు ఇక్కడ పని చేస్తున్న సిబ్బందిని వెంటాడుతున్నాయి. మరోవైపు అప్పుడప్పుడు శ్లాబ్ నుంచి పెచ్చులూడిపడుతున్నాయి. టాయిలెట్లు లేకపోవడంతో మహిళా సిబ్బంది పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.



గతంలో కూలిన గోదాము

### నాలుగు మండలాలకు దిక్కు

యలమంచిలి పశువైద్యశాలకు మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాలకు ఇదే రిఫరల్ ఆస్పత్రి కావడంతో నిత్యం వైద్యం కోసం గేదెలు, ఆవులు, కుక్కలు, కోళ్లు, గొర్రెల్ని రైతులు ఇక్కడకు తీసుకొస్తుంటారు. వేలాది మూగజీవాలకు ఇక్కడే వైద్య సేవలందిస్తారు. మూగజీవాలకు అవసరమైన శస్త్ర చికిత్సలు చేసే నైపుణ్యమున్న వైద్యులు ఉన్నా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదు. ఇక్కడి వైద్యశాలలో ఏడీ సహా పశువైద్యులు, సహాయక సిబ్బంది మొత్తం 10 మందికిపైగా పని చేస్తున్నారు. వీరంతా ఎప్పుడు కూలిపోతుందో తెలియని ఈ ఆస్పత్రి భవనంలోనే క్షణక్షణం భయం భయంగా వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యశాలకు ఆనుకుని నిర్మించిన గోదాము చాలా ఏళ్ల క్రితమే కూలిపోయింది. ఆస్పత్రిలో రికార్డులు, వస్తువులు, మందులు, ఫర్నిచర్ తదితర సామగ్రిని భద్రపర్చడం అధికారులు, సిబ్బందికి పెద్ద సవాల్‌గా ఉంటోంది. మెరుగైన వైద్య సేవలందించడానికి వీలుగా పూర్తిగా శిథిలమైన పశువైద్యశాల భవనానికి మరమ్మతులు చేపట్టడం కానీ, కొత్త భవనం నిర్మించడం కానీ చేయాలని పాడిరైతులు, వైద్యశాల సిబ్బంది కోరుతున్నారు.



మందుల గది దుస్థితి



పెచ్చులూడిన పశువైద్యశాల పైకప్పు

### ప్రతిపాదనలు పంపించాం..



యలమంచిలి ప్రాంతీయ పశువైద్యశాల భవనం చాలా పాతది. 1960లో నిర్మించారు. పైకప్పు, గోడలు శిథిలమయ్యాయి. చిన్న వర్షం కురిసినా గదుల్లోకి నీరు కారుతోంది. నాతో పాటు కింది స్థాయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మహిళా సిబ్బంది మరింత భయాందోళనకు గురవుతున్నారు. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే నాణ్యమైన వైద్య సేవలందించగలుగుతాం.

– డాక్టర్ సీహెచ్ ఎం.ఎం.గంగాధర్, అసిస్టెంట్ డైరెక్టర్, ఏరియా పశువైద్యశాల

### రాజన్న జయంతికి ఏర్పాట్లు పూర్తి



మునగపాక లో రాజన్న విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న అభిమాని

మునగపాక: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. మునగపాకలోని నందీశ్వర ప్రాంగణంలో రాజన్న విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ నివాళులర్పించడంతో పాటు కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కోటవురట్ల: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ 76వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మహానేత విగ్రహం వద్ద ఉదయం 8.30 గంటలకు జయంతిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాల వద్ద ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, అభిమానులు జయంతిని జరిపి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

అచ్యుతాపురం రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలకు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు కోరారు. పార్టీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్.రాయవరం: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఎస్.రాయవరంలోని ఆయన విగ్రహానికి మంగళవారం ఉదయం 9 గంటలకు నివాళులర్పించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. గ్రామాల్లో విగ్రహాలకు కూడా పూలమాలలు వేయాలన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



యలమంచిలిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని క్లబ్ రోడ్డులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. యలమంచిలి పట్టణ ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి పోనుపల్లి వెంకట్రావు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరావు మాదిగ, యలమంచిలి ఇన్‌చార్జి దిగుమర్తి రాజబాబు, పెదపూడి బండియ్య, గోరింట్ల చక్రవర్తి, దిగుమర్తి కనకరాజు, దిగుమర్తి శ్రీను, కొత్తలంక శేఖర్, కొత్తలంక ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పాయకరావుపేట పట్టణంలో సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు ఆధ్వర్యంలో వైజంక్షన్ నుంచి చిత్రం మందిర్ థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంద కృష్ణ జన్మదినం సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్, సీఐ జి.అప్పన్న కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లి చినఅప్పారావు, ఇన్‌చార్జ్ వాసపల్లి వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, డొక్కా అజయ్ బాబు, సలికే గోవిందు, ఆరుగుల రమేష్, ఆరుగుల కొండబాబు, గంపల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## 'రోడ్డు విస్తరణలో మాయాజాలం'

అచ్యుతాపురం రూరల్ : అప్పన్నపాలెం నుంచి సెజ్ ముఖద్వారం వరకూ తలపెట్టిన రహదారి విస్తరణలో అధికారులు తమను మాయ చేసే పనులో నిమఘ్నమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పన్నపాలెం నుంచి సెజ్ ముఖద్వారం వరకూ సుమారు 300 మంది రైతులు ఉన్నప్పటికీ కేవలం 30 మంది రైతులతో సోమవారం సమావేశం నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భూములు ఇచ్చే వరకూ ఎటువంటి నోటీసులు కానీ, నగదు కానీ ఇచ్చేది లేదని కరాఖండిగా తేల్చిచెప్పారని రైతులు వాపోయారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా బేరసారాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం, నగదు కూడా ఇవ్వమని కేవలం టీడీఆర్ బాండ్లు మాత్రమే ఇస్తామని అధికారులు అనడంతో రైతులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే అభివృద్ధికి ఎవరూ అడ్డం కాదని, రైతులకు నష్టపరిహారాన్ని నగదు రూపంలో చెల్లించి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.



రహదారి విస్తరణకు రైతులతో సమావేశమైన అధికారులు

## సదరం స్లాట్‌కు సర్వర్ మొరాయింపు

సచివాలయాల్లో రెండు రోజులుగా దివ్యాంగుల ఇబ్బందులు

కశింకోట: మండల సచివాలయాల్లో సర్వర్ పని చేయకపోవడంతో సదరం స్లాట్‌కు దివ్యాంగులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొదటి రోజు గత శనివారం సైట్ ఓపెన్ కాలేదు. రెండో రోజు సోమవారం సైట్ ఓపెన్ కాగా ఒక్కొక్కరివి నమోదైన తర్వాత సర్వర్ మొరాయించింది. దీంతో అనేక మంది నిరీక్షించి ప్రైవేటు నెట్ సెంటర్లకు వెళ్లి నమోదు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సదరం సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వం నిర్దేశించిన ఆస్పత్రుల్లో వైద్యులు పరీక్షించి అర్హత ఉన్న మేరకు వారి అంగవైకల్య శాతం నిర్ధారిస్తారు. ఆ తర్వాత సర్టిఫికెట్ జారీ చేస్తారు. వాటితో అర్హత మేరకు దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు, రాయితీలు లభిస్తాయి. ఈ సర్టిఫికెట్లు పొందడం కోసం ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లడానికి స్లాట్ రసీదు ఇస్తారు. ఇందుకోసం గత శని, సోమవారాలు సచివాలయాల్లో సంప్రదించాలని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సచివాలయాలకు వెళితే సైట్ పని చేయకపోవడంతో ఎక్కువ సమయం నిరీక్షించి వెనుదిరిగారు. కశింకోట సచివాలయంలో ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లు సదరం సైట్‌లో నమోదుకు ప్రయత్నించగా, ఒకరికి మాత్రం నమోదైన తర్వాత మొరాయించింది. దీంతో కొంతసేపు నిరీక్షించిన తర్వాత తీవ్ర నిరాశతో దివ్యాంగులు వెనుతిరిగారు. తాళ్లపాలెం సచివాలయంలోనూ ఇదే పరిస్థితి. కన్నూరుపాలెం సచివాలయంలో మాత్రం కొంతమందికి నమోదు చేశారని సమాచారం. దీంతో ప్రైవేటు నెట్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలకు అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాలకు వెళ్లి కొందరు నమోదు చేసుకోవలసి వచ్చిందని వాపోయారు. నమోదుకు ఆదేశాలు లేవని, రెండు రోజులే గడువు ఇచ్చారని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీని దృష్ట్యా గడువు పెంచి సదరం నమోదుకు అవకాశం కల్పించాలని దివ్యాంగులు కోరుతున్నారు.



కశింకోట సచివాలయంలో సదరం సైట్‌లో నమోదుకు బారులు తీరిన లబ్ధిదారులు

## బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

ఎస్.రాయవరం: సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'ని నాదంతో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం అడ్డురోడ్డులో పార్టీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ చేష్టలను మనం కొద్ది రోజుల పాటు వేచి చూద్దామనుకున్నా.. ప్రజలే ప్రశ్నించే పరిస్థితి ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఒకటి, రెండు పథకాలు అసంపూర్తిగా అమలు చేసి, సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేశామని చెప్పుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి మోసపూరిత మాటలను 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే వైఎస్సార్‌సీపీ సమావేశాలకు ప్రజలు, కార్యకర్తలు వస్తున్నారంటే గ్రామాల్లో కూటమి నాయకులు చేస్తున్న ఆగడాలు పెచ్చుమీరాయన్న విషయం అర్థమవుతోందన్నారు. ఇవన్నీ తట్టుకుని నిలబడిన కార్యకర్తలకు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు.

**బాబు మెప్పు కోసమే అనిత వ్యాఖ్యలు**

పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న హోంమంత్రి అనితకు అడ్డురోడ్డు–నర్సీపట్నం రోడ్డు గోతులు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పదవి ఉంద కదా? అని స్థాయి మరిచిపోయి హోంమంత్రి మాట్లాడుతున్నారని, చంద్రబాబు మెప్పు కోసం మాట్లాడితే ప్రజలు నిలదీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. పార్టీ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ నియోజకవర్గంలో మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలు వేస్తామన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ అధికారంలో లేకపోయినా వస్తున్న ప్రజాదరణను చూసి కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత, మాజీ ఎమ్మెల్సీ, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డీవీ సూర్యనారాయరాజు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి, శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు కాకర దేవి, గోసల కాసులమ్మ, లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, జిల్లా అధికార ప్రతినిధి దగ్గపల్లి సాయి, నాయకులు నల్లపరాజు వెంకటరాజు, రాముదాజు, దనిశెట్టి బాబూరావు, దేవరపు రాజేష్‌కన్నా, కొణతాల శ్రీనివాసరావు, వెదుళ్ల బంగారి, గుర్రం నానాజీ, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, చీకట్ల జగదీష్, మల్లే లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

అచ్యుతాపురం రూరల్ : ఈ నెల 9న జరిగే కార్మిక, రైతు సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో సెజ్ రహదారుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే ఈ సమ్మెలో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీచిట్టి పైడితల్లమ్మ ముఠా సంఘం మేస్త్రి రాజాన సత్తిబాబు, ఆర్.అప్పలకొండ, రెడ్డి చిన్నబాబు, డి.అప్పలనాయుడు, డి.రాజశేఖర్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

## గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోఆర్‌డీ డేవిడ్ రాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీల్లో పూడికతీత ఎప్పటికప్పుడు చేపట్టడం, రోడ్డుపై చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీరాంపురం గ్రామంలో రోడ్డు పక్కన తుప్పలు తొలగించి పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన పొక్లెయిన్‌తో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం